ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 25 నవంబరు 2025

29న జడ్పీ స్థాయీసంఘ సమావేశాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని జిల్లాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 29న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్టు సీఈవో సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు సమావేశాలు ప్రారంభమవుతాయని, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు. సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు.

ధాన్యం కొనుగోలులో దళారుల దందా



● నరసన్నపేటలోని భవానీపురానికి చెందిన కొంతమంది రైతులు నాలుగు రోజుల కిందట కంబకాయి సర్వీసు రోడ్డులో ధాన్యం ఆరబెట్టారు. నరసన్నపేటకు చెందిన ఒక దళారీ ఆ రైతుల వద్దకు వెళ్లాడు. షెడ్యూల్ తీసుకోవడం నుంచి.. శాంపిల్స్ సేకరణ, ధాన్యం మిల్లుకు పంపించేవరకు అంతా తన బాధ్యతేనని చెప్పాడు. అందుకు బస్తాకు 3 కిలోల చొప్పున మిల్లర్లకు అదనంగా ధాన్యం ఇవ్వాలని.. తన కమీషన్ రూ.200 చొప్పున చెల్లించా లని ఒప్పందం కుదర్చుకున్నాడు. వారి నుంచి సుమారు 200 బస్తాల ధాన్యం కొనుగోలు చేశాడు.

● జమ్ము గ్రామానికి చెందిన రైతులు ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వెళ్లగా షెడ్యూల్ ఇచ్చే వారు లేరు. శాంపిల్స్ తీసుకునేవారు లేరు. తేమ నిర్ధారించే యంత్రాలు కూడా లేవు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు భయపడి నేరుగా మిల్లర్లను ఆశ్రయించి విక్రయించారు. వారు బస్తాకు 2 నుంచి 5 కేజీల వరకు ధాన్యం అదనంగా తీసుకున్నారు.

● ఈలింగ్ పేరుతో మాయాజాలం
● బస్తాపై అదనంగా 2 నుంచి 5 కేజీలు
● కమీషన్ల రూపంలోనూ డబ్బుల వసూలు
● 'ప్రభుత్వ' కేంద్రాల్లో లేని సాంకేతిక సిబ్బంది
● మిల్లర్లు, వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు

నరసన్నపేట/ రణస్థలం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో దళారీలు, మిల్లర్ల దందా కొనసాగుతోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు వెళ్లాల్సిన పనిలేదు. శాంపిల్స్ బాధ ఉండదు. రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర జమవుతుంది. కానీ 80 కేజీల బస్తాకు రూ.100 నుంచి రూ.200 దళారీలు తీసుకునేందుకు, మిల్లర్లకు అదనంగా 2 కేజీల నుంచి 5 కేజీల ధాన్యం ఇచ్చేందుకు ముందస్తు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 3.80 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. ప్రస్తుతం వరికోతలు, నూర్పులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వం 406 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 6.5 లక్షల మెట్రిక్‌టన్నులు సేకరించాలని నిర్ణయించింది. కానీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. కొనుగోలు కేంద్రాలకు తేమశాతం నిర్ధారించే యంత్రాలు పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదు. కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. ధాన్యం విక్రయాలకు సంబంధించి కేంద్రాల్లో రైతులకు షెడ్యూల్ ఇవ్వడం లేదు. శాంపిల్స్ తీసుకువెళ్లేందుకు రావాలని కోరగా.. సాంకేతిక సిబ్బంది అందుబాటులో లేరని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. దీంతో రైతులు మిల్లర్లు, దళారీలను ఆశ్రయించి ధాన్యం విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా వారు అదనంగా ధాన్యంతోపాటు కమీషన్ల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది మద్దతు ధర (మిగతా 6వ పేజీలో..)

మిల్లర్లతో కుమ్మక్కు

పౌరసరఫరాలశాఖ, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొంతమంది సిబ్బంది మిల్లర్లతో కుమ్మక్కు అయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే ధాన్యం విక్రయించేందుకు వెళ్లిన రైతులను ఇబ్బందులు పెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మిల్లర్లు పంపించిన రైతుల జాబితాకు మాత్రం వేగంగా షెడ్యూల్ ఇస్తున్నారని, వారి ధాన్యం శాంపిల్స్ నిర్ధారణ రిపోర్టు ఇచ్చి.. మిల్లలకు ధాన్యాన్ని అటాచ్ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొంతమంది మిల్లర్లు భారీస్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాలశాఖ అధికారులు తనిఖీలు చేపడితే నిల్వలు బయటపడే అవకాశం ఉందని చెబుతున్నారు.

దళారుల బారిన పడొద్దు

జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ మద్దతు ధర మేర చెల్లింపులు జరుగుతాయి. రైతులు దళారుల బారిన పడొద్దు. 7337359375 నెంబర్‌కు హాయ్ అని వాట్సాప్ మెసేజ్ పెడితే చాలు పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందిస్తారు. వివరాలు నమోదు చేసుకొని ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే 1967 టోల్‌ఫ్రీ నెంబర్, 9963479141 కంట్రోల్ రూమ్ నెంబర్‌ను సంప్రదించాలి.

- టి.వేణుగోపాల్, డీఎం, పౌరసరఫరాల సంస్థ



రణస్థలంలో వరిపంట నూర్పులు..



ఇటీవల వంతెనపై వరదనీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్న పెద్దరోకళ్లపల్లి గ్రామస్థులు

ఎన్నాళ్లీ ముంపు కష్టాలు?

● వరదలు వస్తే రాకపోకలు బంద్
● మూడు గ్రామాల ప్రజల ఆవేదన
● వంతెన ఎత్తు పెంచాలని వినతి

టెక్కలి రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వర్షం కురిస్తే చాలు.. ఆ మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. నిచ్చప్పల గెడ్డ పొంగి ప్రవహించి.. బాహ్య ప్రపంచంతో గ్రామస్థులకు సంబంధాలు తెగిపోతాయి. ఎవరికి అనారోగ్యం వచ్చినా.. అత్యవసర వైద్యం అందించాల్సి ఉన్నా.. వరదనీరు తగ్గేవరకు బయటకు రాలేని పరిస్థితి. ఇదీ మెళియాపుట్టి మండలంలోని పెద్దరోకళ్లపల్లి, రామ్‌నగర్, సీతారామపల్లి గ్రామస్థుల దుస్థితి. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురవగా ఈ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మూడు రోజులపాటు ఆయా గ్రామస్థులు బయటకు రాలేక ఇబ్బందులు పడ్డారు. నిచ్చలప్ప గెడ్డ ఉప్పొంగి ప్రవహించడంతో గతంలో నిర్మించిన వంతెన ముంపునకు గురైంది. ఈ గ్రామాలకు నౌపడ ఆర్ఎస్, తలగాం నుంచి రహదారులు ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా గెడ్డలోకి నీరు చేరి.. గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. నందిగాం మండలంలోని దిమిలాడ, నౌగాం ప్రాంతాలో నుంచి అధికంగా నీరువచ్చి గెడ్డలో చేరుతోంది. 40 ఏళ్లుగా ముంపు సమస్య ఉన్నా అధికారులు, నాయకులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. వర్షాలు కురిసే వేళ బయటకు రావాలంటేనే భయమేస్తోందని వాపోతున్నారు. వంతెన ఎత్తు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మంత్రి అచ్చెన్న చొరవతోనైనా..

2004లో అప్పటి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు సుమారు రూ.50 లక్షలు వెచ్చించి వంతెన నిర్మించారు. నౌపడ ఆర్ఎస్ నుంచి పెద్దరోకళ్లపల్లి పంచాయతీకి బీటీ రోడ్డు వేయించారు. కాగా, ప్రస్తుతం గెడ్డలో పూడిక పేరుకు పోవడంతో (మిగతా 6వ పేజీలో..)

వరదలు వస్తే భయం



వరదలు వస్తే భయమేస్తుంది. పైనుంచి అధికంగా వరద నీరు వస్తుండంతో ప్రతి ఏడాదీ ముంపు కష్టాలు తప్పడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాలేకపోతున్నాం.

- నీలాపు గరకమ్మ, పెద్దరోకలర్లపల్లి

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



ముంపు సమస్యను పరిష్కరించాలని మా గ్రామాల ప్రజలు ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లాం. గెడ్డపై వంతెన ఎత్తు పెంచేందుకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రహదారి సమస్య పరిష్కారమైంది. మళ్లీ వంతెన నిర్మాణం ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతుందని ఆశిస్తున్నాం.

- ధర్మారావు, సర్పంచ్, పెద్దరోకళ్లపల్లి

ఉద్యాన, వాణిజ్య పంటలపై దృష్టి సారించాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ● పొన్నాడలో 'రైతన్నా మీకోసం' నిర్వహణ


ఎచ్చెర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కేవలం వరిసాగు కాకుండా ఉద్యాన, వాణిజ్య పంటలపై కూడా రైతులు దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. రైతన్నా మీ కోసం' వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఎచ్చెర్ల మండలం పొన్నాడలో ఆయన పర్యటించారు. పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. 'రబీలో వేరుశనగ, చోడి, పొద్దుతిరుగుడు, పామాయిల్ తదితర పంటలను సాగుచేయాలి. అలాగే ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయలు పండించాలి. జిల్లా కేంద్రానికి అతి చేరువలో ఉండడంతో ఈ ప్రాంత రైతులు పాడిపోషణతో ప్రయోజనం పొందవచ్చు. బీడు భూముల్లో పశుగ్రాసం సాగుచేయాల'ని కలెక్టర్ సూచించారు. బుధవారం సచివాలయం వద్ద గ్రామ స్థాయి వ్యవసాయ ప్రణాళికను ప్రదర్శించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ కె.సూర్యనారాయణ, ఏడీఏ బి.రజని, ఎంపీడీవో ఎస్.హరిహరరావు, ఏవో వి.రాజేశ్వరరావు, నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు, పి.సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నీలమప్పడు పాల్గొన్నారు.



పొన్నాడలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎన్జీవో తాలుకాల ఎన్నికల శంఖారావం

అరసవల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో తాలూకాకు సంబంధించిన ఎన్నికలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, కార్యదర్శి చల్లా శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 'ఎన్జీవోల తాలూకా కార్యవర్గాల కాలపరిమితి ఈ నెలతో ముగుస్తుంది. అన్ని తాలూకాలకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్‌ను రూపొందించాం. ఎన్నికల్లో అన్ని విభాగాల ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలి. నాలుగు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తాం. తొలి విడతలో ఇచ్ఛాపురం, పలాస, సోంపేట తాలూకాలకు ఈ నెల 27న నామినేషన్ల స్వీకరిస్తాం. డిసెంబరు 4న ఎన్నిక నిర్వహిస్తాం. పాతపట్నం, హిరమండలం, కొత్తూరు తాలూకాలకు సంబంధించి ఈ నెల 29న నామినేషన్లు స్వీకరిస్తాం. డిసెంబరు 6న ఎన్నిక నిర్వహిస్తాం. టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట తాలూకాలకు సంబంధించి డిసెంబరు 3న నామినేషన్లు స్వీకరిస్తాం. అదే నెల 10న ఎన్నికలు. పొందూరు, ఆమదాలవలస, రణస్థలం తాలూకాలకు సంబంధించి డిసెంబరు 5న నామినేషన్ల స్వీకరణ, అదే నెల 12న ఎన్నికలు నిర్వహిస్తామ'ని తెలిపారు.



ఉద్జుడుమెట్టపై కంకర తవ్వకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ కల్యాణచక్రవర్తి

ఉజ్జుడుమెట్టపై రెవెన్యూ అధికారుల సర్వే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

● ఆక్రమణలపై ప్రభుత్వానికి నివేదిస్తామన్న తహసీల్దార్ 6లో

ఐటీడీఏలో అక్రమాలపై విచారణ

● అవకతవకలపై విజిలెన్స్‌కు దళిత సంఘాల ఫిర్యాదు
● రేపు ముగ్గురు అధికారులపై దర్యాప్తు
● గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ఆదేశం

టెక్కలి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏలో ముగ్గురు అధికారుల అవినీతి, అక్రమాలపై విచారణకు రంగం సిద్ధమైంది. ఐటీడీఏ పరిధిలో జరిగిన అక్రమాలపై దళిత సంఘాల జేఏసీ ఫిర్యాదు మేరకు ఈ నెల 26న విచారణ చేపట్టాలని గిరిజన సంక్షేమ డైరెక్టర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించి ట్రైకార్ ఎండీ సీఏ మణికుమార్‌ను దర్యాప్తు అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

● వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐటీడీఏ పరిధిలోని సీఆర్టీల రెగ్యులైజేషన్‌లో అవకతవకలు జరిగాయి. కొంతమంది దగ్గర డబ్బులు తీసుకొని బ్రేక్ సర్వీస్ ఉన్న వారికి కూడా రెగ్యులరైజ్ చేశారు.

● జువైనెల్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాలకు భిన్నంగా అక్రమ బదిలీలు, డిప్యుటేషన్లు చేపట్టారు. ఈ ఏడాది మే నెలలో జరిగిన బదిలీల్లో అధికారులకు అనుకూలంగా ఉన్నవారికి కోరుకున్న చోట స్థానాలు ఇచ్చారు. టెక్కలి ఆశ్రమ పాఠశాలలో సీనియర్ జాబితాలో ఆరవ స్థానంలో ఉన్న ఉపాధ్యాయుడికి స్థానం ఇవ్వకుండా, 64వ స్థానంలో ఉన్నవారికి అవకాశం ఇచ్చారు. బాలికల పాఠశాలలకు పురుష టీచర్లను నియమించారు. బదిలీల తర్వాత అనేక మందికి అక్రమ డిప్యుటేషన్లు కూడా వేశారు. బందపల్లి బాలికల పాఠశాల నుంచి మహిళా టీచర్‌ను టెక్కలి బాయ్స్ స్కూల్‌కి, టెక్కలిలో ఉన్న ఉపాధ్యాయుడిని బందపల్లి గర్ల్స్ స్కూల్‌కి డిప్యుటేషన్ వేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా మెళియాపుట్టి ఏటీడబ్లూవోను, స్కూల్ అసిస్టెంట్లను, డిప్యూటీ వార్డెన్లను నియమించారు.

● గత ప్రాజెక్ట్ అధికారి కాలంలో టెండర్లు లేకుండా మెస్‌లు, గ్యాస్ స్టౌవ్‌లు తదితర సామగ్రి కొనుగోలు చేశారు. పాఠశాలల్లో మెస్‌లు బిగించడానికి ప్రధానోపాధ్యాయులకు వేలాది రూపాయలు ఖర్చయ్యాయి. వాటిని ఐటీడీఏ అధికారులు ఇవ్వలేదు. నిధులు దుర్వినియోగం చేశారని దళిత సంఘాల జేఏసీ సభ్యులు ఆరోపించారు. వీటిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఇటీవల విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

● ఈ మేరకు ఐటీడీఏలోని ఏపీవో జి.చిన్నబాబు, డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర, సూపరింటెండెంట్ కె.దేస్‌పై ఉన్నతాధికారులు బుధవారం విచారణ చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఫైళ్లతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. బుధవారం ఉదయం 11గంటలకు దర్యాప్తు జరుగుతుందని ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు.



సీతంపేట ఐటీడీఏ కార్యాలయం

రాష్ట్ర బార్‌కౌన్సిల్ ఎన్నిక ప్రచారం ప్రారంభం

శ్రీకాకుళం లీగల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నిక కోసం జిల్లా న్యాయస్థానంలో జోరుగా ప్రచారం సాగుతోంది. పోటీలో ఉన్న పలువురు అభ్యర్థులు తమ మద్దతుదారులతో న్యాయవాదులను కలిసి ఓట్ల కోసం అభ్యర్థిస్తున్నారు. సోమవారం శ్రీకాకుళం బార్ నుంచి గతంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన గేదెల వాసుదేవరావు.. మరోసారి ఎన్నికల బరిలో నిలిచి ప్రచారం ప్రారంభించారు. పార్వతీపురం బార్‌కు చెందిన నల్లా శ్రీనివాసరావు, ఆమదాలవలస బార్‌కు చెందిన కిల్లి మార్కండేయులు తదితరులు ప్రచారాలు చేపట్టారు. తమను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు చమళ్ళ నరసింహమూర్తి, వాన కృష్ణచంద్, ఎన్ని సూర్యారావు, మామిడి క్రాంతి, ఆగూరు ఉమామహేశ్వర రావు, అసోసియేషన్ ప్రతినిధులు పిట్టా దామోదర్, కొమ్ము రమణమూర్తి పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ఎల్ఎన్ పేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులను ఆర్థికంగా ఆదుకొని అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. స్కాట్‌పేటలో సోమవారం జరిగిన 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాల వంటి వారని అన్నారు. రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. అన్నదాతల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ, ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి కిరణ్‌వాణి, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మోహనరావు, కె.చిరంజీవి, ఏఎంసీ వైస్ చైర్మన్ కె.కృష్ణమాచారి, నాయకులు వి.గోవిందరావు, ఎస్.తేజేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాసరావు, జి. రాము తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

హిరమండలం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. 'రైతన్నా...మీకోసం' కార్యక్రమంలో భాగంగా అవలంగి రైతులతో సోమవారం ఆయన మాట్లాడారు. విత్తు నుంచి విక్రయం వరకు, వ్యవసాయ యాంత్రీకరణతో సహా అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీప్రసాద్, ఏవో సంధ్య, జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, ప్రత్యేకాహ్వానితులు టి.తిరుపతిరావు, టీడీపీ మండల అధ్యక్షుడు డి.డిల్లేశ్వరరావు, యాళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

సమస్యలు గుర్తించేందుకే 'రైతన్నా మీకోసం'

● వ్యవసాయశాఖ జేడీ మోహనరావు

పొందూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రయోజనం చేకూర్చి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను గుర్తిం చేందుకే ప్రభుత్వం 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం నిర్వహిస్తోందని వ్యవసాయశాఖ జేడీ ఎస్‌వైవీఎస్ మోహనరావు అన్నారు. గ్రామంలో సోమవారం సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రైతుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరావు, ఏఈవో ప్రవీణ్ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పథకాలు వినియోగించుకోవాలి

జి.సిగడాం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రత్యేకాధికారి, సుడా ఈఈ పొగిరి సుగుణాకరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం వారం రోజుల పాటు నిర్వహిస్తు న్నామన్నారు. చిరుధాన్యాల సాగుపై రైతులు ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సరిత, ఎంపీడీవో జి.రామకృష్ణ, ఏవో బెండు బాబ్జి, టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ప్రత్యేకాధికారి సుగుణాకరరావు

రసాయన ఎరువులు తగ్గించాలి: ఆర్డీవో

గార, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల్లో రసాయన ఎరువులను తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఆర్డీవో సాయి ప్రత్యూష సూచించారు. సోమవారం గొంటి రైతు సేవా కేంద్రంలో 'రైతన్న మీకోసం' కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.శ్రీనివా సులు, తహసీల్దార్ ఎం.చక్రవర్తి, ఏవో దుంపల పద్మావతి, సర్పంచ్ చల్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష



రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● కేవీకే కో-ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి

ఆమదాలవలస, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని కొర్లకోట, కొరపాం, పీరుసాహెబ్ పేట మున్సిపాలిటీలోని కుద్దిరాం తదితర గ్రామాల్లో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలు, పంట సంరక్షణలో సాంకేతిక పద్ధతులు, ధాన్యం కొనుగోలు విధానాలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. పంటల ప్రస్తుత స్థితి, అత్యవసరమైన చర్యలు, రబీ సీజన్‌కు అవసరమైన సూచనలు, ఎరువుల వాడకం, నీటిపారుదల, చీడపీడల నియంత్రణ ను వంటి అంశాలపై రైతులకు మార్గనిర్దేశం చేశారు. జిల్లా వనరుల కేంద్రం నుంచి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.వెంకటరావు.. ఉద్యాన అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాగోలు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు మధుకుమార్, ఉదయ్‌బాబు, మండల వ్యవసాయాధికారి మెట్ట మోహన్‌రావు, సనపల అప్పలనాయుడు, ఎంపీటీసీ, అన్నెపు భాస్కరరావు, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ జయమ్మ, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుల్లో అల్పపీడనం గుబులు

● వర్షాలు కురుస్తాయని ఆందోళన
● ముమ్మరంగా వరి కోతలు

నరసన్నపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం వల్ల వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతన్నల్లో గుబులు మొదలైంది. గత నెలలో వచ్చిన మొంథా తుఫాన్ పెద్దనష్టం కలిగించక పోపయినా టెన్షన్‌కు గురయ్యారు. అయితే ఈసారి ఏం అవుతుందోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. గతేడాది ఇదే సమయంలో వచ్చిన ఫెంగల్ తుఫాన్‌తో కల్లాల్లోని ధాన్యం తడిచి మొలకలు వచ్చాయి. పొలాల్లో వరిపనలు దెబ్బతిన్నాయి. ఈఏడాది కూడా అదే సమయంలో తుఫాన్ వస్తుండడంతో రైతుల్లో కలవరం మొదలైంది. జిల్లాలో ఈఏడాది 3.80 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఇప్పటికే 1.50 లక్షల ఎకరాల్లో వరికోతలు పూర్తికాగా.. పొలాల్లోనే 60శాతం మంది రైతులు కుప్పలు పెట్టారు. 40 శాతం మంది రైతులు యంత్రాలతో నూర్పుడి చేశారు. 406 కొనుగోలు కేంద్రాలు ద్వారా నాలుగు రోజుల నుంచి ధాన్యం కొనుగోలు పక్రియ సాగుతోంది. సోమవారం పలువురు రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ అయ్యాయి. దీంతో రైతులు ధాన్యం ఇబ్బడి చేసుకుని తుఫాన్‌కు దొరకకుండా కొనుగోలు కేంద్రాలకు ఇచ్చేందుకు పరుగులు పెడుతున్నారు. నరసన్నపేట, జలుమూరు, పోలాకి, సారవకోట, పాతపట్నం, ఎల్ఎన్‌పేట, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, గార, శ్రీకాకుళం రూరల్, సరుబుజ్జిలి, కొత్తూరు. హిరమండలం, నందిగాం, ఇచ్ఛాపురం తదితర మండలాల్లో వరికోతలు సాగుతున్నాయి.



జమ్ము వద్ద యంత్ర సాయంతో కోత, నూర్పు చేస్తున్న దృశ్యం

కల్లాల్లోనే ధాన్యం

జలుమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జలుమూరు మండలంలో చాలా మంది రైతులు వరి కోతలు ముమ్మరం చేశారు. ధాన్యం కల్లాకు చేర్చారు. ఇప్పుడు తుఫాన్ హెచ్చరికలు జారీ కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని భద్రపరచుకోడానికి, కోసిన వరిపనలు తడవకుండా ఉండేందుకు కుప్పలు పెట్టడానికి రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. కూలీలు కొరతతో పనులు సజావుగా సాగడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జలుమూరులో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని భద్రపరచుకుంటున్న రైతులు

ధాన్యం కొనుగోలులో దళారుల దందా

(ఐదో పేజీ తరువాయి)

ప్రకటించింది. 17 శాతంలోపు తేమ ఉంటే బస్తాకు రూ.1895 మద్దతు ధరగా ప్రకటించింది. కానీ దళారులు తేమశాతం ఎక్కువగా ఉందని, ధాన్యం దిగుబడి (ఈలింగ్) రాదంటూ.. రూ.1600లోపు అడుగుతున్నారు. ఇలా నరసన్నపేట మండలంలోని నడగాం, చిక్కావలస, సుందరాపురం, చెన్నాపురం, చోడవరం, జలుమూరు మండలం కూర్మనాథపురం, గొటివాడ, పాగోడు తదితర గ్రామాల్లో దళారీలు కొనుగోలు చేస్తున్నారు.

'వాట్సాప్' సేవలు అందుబాటులోకి వచ్చినా..

గత అనుభవాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ సేవలను సైతం అందుబాటులోకి తెచ్చింది. రైతులు 7337359375 నెంబరుకు హాయ్ అని మెసేజ్ పెట్టగానే పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందిస్తారు. రైతుల వద్ద ఎన్నిబస్తాల ధాన్యం ఉన్నాయి? ఏ రకం? బస్తాలు ఎప్పటికి సిద్ధమవుతాయి? వంటి వివరాలు ఆరా తీస్తారు. ఏ కేంద్రంలో ఏ రోజు? ఏ సమయానికి? ఏ రకం ధాన్యం.. ఎన్ని బస్తాలు విక్రయించాలో తదితర వివరాలతో కూడిన స్లాట్ బుక్ అవుతుంది. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో నగదు రైతుల అకౌంట్లలో జమవుతుంది. రైతుసేవా కేంద్రాలు, మిల్లుల్లో ఒకేలా తేమశాతాన్ని కొలిచే యంత్రాలను ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదేశించింది. మరోవైపు రైతులకు ధాన్యం విక్రయాల్లో ఇబ్బందులు ఎదురైతే తెలియజెప్పేందుకు 1967 టోల్ ఫ్రీ నెంబర్‌ను సైతం అందుబాటులో తెచ్చింది. కంట్రోల్ రూం నంబరు 9963479141 నంబరుకు సైతం సంప్రదించవచ్చు. అయినప్పటికీ జిల్లాలో దళారుల హవా తగ్గేలా కనిపించడం లేదు. వారికి చెక్ చెప్పాలంటే ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

ఎన్నాళ్లీ ముంపు కష్టాలు?

(ఐదో పేజీ తరువాయి)

దిగువ ప్రాంతాలకు నీరు వెళ్లలేక.. వంతెన పైనుంచి ప్రవహిస్తోంది. దీంతో ముంపు సమస్య ఎదురవుతోంది. వంతెన కూడా శిథిలావస్థకు చేరుకుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినా కనీసం పట్టించుకోలేదు. ఇటీవల మంత్రి అచ్చెన్న దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లగా వంతెన నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆయా గ్రామస్థులు ముంపు ముప్పు నుంచి తమ కష్టాలు తొలగనున్నాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

40 ఏళ్ల నుంచి అంతే..



40ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి ఉంది. చినుకు పడితే వణుకు పుడుతుంది. గతంలో టీడీపీ ప్రభుత్వంలో మా గ్రామాలకు రహదారుల సౌకర్యం కల్పించారు. గెడ్డపై లో లెవెల్ వంతెన నిర్మాణం వల్ల ఇబ్బందులు తప్పడం లేదు.

- వి.లక్ష్మీదేవి, పెద్దరోకర్లపల్లి

బయటకు రాలేం



ఒక్కొక్కసారి వరదలు వస్తే గ్రామం నుంచి బయటకు రాలేని పరిస్థితి. కొత్త వంతెన నిర్మిస్తే మంచిది.

-లచ్చయ్య, సీతారాంపల్లి

ఉజ్జుడుమెట్టపై సర్వే

● ఆక్రమణలపై ప్రభుత్వానికి నివేదిస్తామన్న తహసీల్దార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పలాస, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పలాసలోని ఉజ్జుడు మెట్ట ఆక్రమణలపై అధికారులు స్పందించారు. సర్వేకు ఉపక్రమించారు. ఈ ఆక్రమణలపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఉజ్జుడుమెట్ట పాయే!' శీర్షికతో ప్రచురించిన కథనంపై రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. మొత్తం 30 ఎకరాల్లో విస్తరించిన ఉజ్జుడుమెట్టలో కంకరను సగానికి పైగా తరలించిన విషయాన్ని అధికారులు గుర్తించారు. తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి, సర్వేయర్ వి.గిరితో కూడిన రెవెన్యూ అధికారుల బృందం మొత్తం మెట్ట ప్రాంతాన్ని పరిశీలించింది. ఆక్రమణదారులు మెట్టకు ముందుభాగంలో లోపల ఏం జరుగుతోందో ఎవరికీ తెలియకుండా మట్టిని నాలుగు అడుగుల మేర వేశారు. తవ్వకాలు జరిగినా రోడ్డుపై ఎవరికీ కనిపించని విధంగా జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో చరణ్ గ్రూప్ సంస్థ దీన్ని ప్రైవేటు వ్యక్తుల వద్ద కొనుగోలు చేసుకొని వెంచర్లు వేసింది. మావోయిస్టుల హెచ్చరికల ఫలితంగా వాటిని యథాతథంగా విడిచిపెట్టి వెళ్లిపోయారు. అనంతరం కంకరమాఫియా దీనిపై కన్నేసి మొత్తం కొండనంతా దొలిచి కంకరను తరలించుకొని సొమ్ము చేసుకున్నారు. రూ.రెండు కోట్ల విలువైన కంకరను తరలించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సందర్భంగా తహసీల్దార్ కల్యాణచక్రవర్తి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మొత్తం కంకర వ్యవహారంపై అధికారులకు నివేదిస్తామని తెలిపారు. అనంతరం కంకర తరలింపుదారులను గుర్తించి... వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆన్‌లైన్‌లో లావాదేవీలు నిర్వహించండి

జలుమూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఆన్‌లైన్‌లోనే లావాదేవీలు నిర్వహించాలని శ్రీకాకుళం డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్.గోపీబాల తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయాన్ని సోమవారం పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఇంటి యజమాని ఆధార్‌కు ఫోన్ నెంబర్లు లింకు చేయాలన్నారు. ఇంటిపన్ను డిమాండ్ నోటీసు, ఇతర లావాదేవీల ఆన్‌లైన్‌లోనే చేయాలన్నారు. మాన్యువల్‌గా ఎటువంటి లావాదేవీలు చేయకూడదన్నారు. సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వద్దన్నా పనులు ఆపలే!

● ఇందిరానగర్‌లో అనుమతి లేని నిర్మాణాలు
● పోలీసులకు ఫిర్యాదు చేసిన సొసైటీ సభ్యులు

నరసన్నపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పల్లిపేట జంక్షన్ వద్ద ఇందిరానగర్‌లో అనుమతులు లేకుండా బహుళ అంతస్తు భవనాలను నిర్మిస్తున్నారు. శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) అనుమతి, అలాగే నరసన్నపేట కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ తీర్మానం లేకుండానే నివాస స్థలాల్లో వాణిజ్య సముదాయాలను నిర్మాణం చేపట్టడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో సొసైటీ సభ్యులు నిర్మాణాలు నిలుపుదల చేయాలని నోటీసులు జారీ చేయడంతో పాటు పోలీసులకు పిర్యాదు చేశారు. ఇందిరానగర్‌లో నివాస స్థలాల కోసం 1950వ దశకంలో నరసన్నపేట కో- ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీని ఏర్పాటు చేశారు. ఈ కాలనీలో ఏ, బీ, సీ విభాగాలుగా ప్లాట్లు విభజించి ఇంటి నిర్మాణాల కోసం కొందరికి స్థలాలు నామమాత్రం రుసుంతో కేటాయించారు. ఈ స్థలాల్లో బిల్డింగ్ నిబంధనల ప్రకారమే నిర్మాణాలు చేయాలని సొసైటీ సభ్యులు చెబుతున్నారు. సొసైటీ ద్వారా లభించిన స్థలంలో నివాస గృహం తప్ప మరే నిర్మాణాలు చేపట్టకూడదన్న షరతుతో అప్పట్లోనే రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. స్థలాన్ని బదలాయించడం, విక్రయించడం, మార్టిగేజ్ చేయడం గానీ వీలు లేదు. ఈ స్థలాల్లో అపార్టుమెంట్లు, ఇతర వాణిజ్య సముదాయాల నిర్మాణం చేపట్టకూడదు. అలాగే సొసైటీ నుంచి ఎన్‌ఓసీ, పంచాయతీ నుంచి ప్లాన్ అప్రూల్ తీసుకున్న తరువాతే నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

అనుమతి లేని నిర్మాణాలు

అయితే గత కొన్నాళ్లుగా సొసైటీ నిబంధనలు అతిక్రమించి బహుళఅంతస్తు (అపార్టుమెంట్) నిర్మాణాలు చేపడుతున్నారు. బిల్డింగ్ సొసైటీ సభ్యులు నిర్మాణదారులకు నోటీసులు కూడా జారీ చేశారు. అయినా నిర్మాణాలు ఆపకపోవడంతో ఈ ఏడాది మే నెలలో పోలీసులు, కలెక్టర్, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. చివరికు సుడాకు కూడా ఫిర్యాదు చేయడంతో.. అధికారులు నిర్మాణాలు నిలుపుదల చేయాలని ఈఏడాది మేలో నోటీసులు జారీ చేశారు. అయినా నిర్మాణదారులు పనులు సాగిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం సొసైటీ ప్రతినిధులు మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బహుళ అంతస్తు భవనాల్లోలో ప్లాట్ల కొనుగోలుకు అడ్వాన్సులు చెల్లించిన వారిలో గుబులు మొదలైంది. ఈవ్యవహారంపై ఈవో ద్రాక్షాయణి వద్ద ప్రస్తావించగా ఇందిరానగర్‌లో బహుళ అంతుస్తు నిర్మాణం సుడా పరిధిలోకి వస్తుందన్నారు.



ఇందిరానగర్‌లో జోరుగా సాగుతున్న నిర్మాణాలు

అర్జీలకు పరిష్కారం చూపాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



గ్రీవెన్స్ వద్ద మౌనంగా రోదిస్తున్న దివ్యాంగురాలు రాములమ్మ

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరిష్కారం చూపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదికను జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 127 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ.. ప్రతీ ఫిర్యాదును వ్యక్తిగత శ్రద్ధతో పరిశీలించి, ఫిర్యాదు దారు సంతృప్తి చెందేలా, నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ డి.పద్మావతి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కదలలేదు.. పింఛన్ ఇప్పించండి

ఎచ్చెర్ల మండలం, కొయ్యాం పంచాయతీ బడివానిపేటకు చెందిన బడి రాములమ్మ దివ్యాంగురాలు. ఆమెకు రెండు కాళ్లు, చేతులు పనిచేయవు. వినబడవు. మాట్లాడలేని పరిస్థితి. పూర్తిగా మంచంపైనే జీవనం. అయినా సరే ఆమెకు పింఛను రావడం లేదు. మూడేళ్లుగా పింఛన్ కోసం అధికారులను వేడుకుంటున్నా స్పందించడం లేదని భర్తతో కలిసి సోమవారం కలెక్టర్‌ను కలిసి కన్నీళ్లతో మూగగా వేడుకుంది. తన దీన పరిస్థితిని అర్థం చేసుకుని పింఛను మంజూరు చేయాలని వినతిపత్రం అందించింది.

సోలార్ దీపాలు వేయండి

గనగళ్లవానిపేట పంచాయతీలో నరసయ్యపేట తీరప్రాంత గ్రామానికి ఈ ఏడాది మేలోనే 18 సోలార్ లైట్లు మంజూరయ్యాయని, అయితే మా గ్రామంలో మాత్రం ఇప్పటి వరకు వేయలేదని, తగు చర్యలు తీసుకోవాలని నరసయ్యపేట గ్రామస్థులు కోరారు. పంచాయతీలో మిగిలిన గ్రామాల్లో వేసి మా గ్రామాన్ని వదిలేశారని, దీంతో రాత్రి సమయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోండి

ఇచ్ఛాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బాహుదానది పాత వంతెన సగం భాగం కూలిపోయి రెండేళ్లవుతున్నా తాత్కాలిక ఏర్పాట్లు తప్ప ఇప్పటి వరకు వంతెన నిర్మాణానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని, చర్యలు తీసుకోవాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి కోరారు. జేసీని కలిసి వినతిపత్రం అందించారు. మున్సిపాల్టీలో ఆక్రమణలపై సర్వే చేయాలని కోరారు.

పెంచిన కొడుకే గెంటేస్తున్నాడు

● వృద్ధ దంపతుల ఆవేదన

కళింగపట్నం దరి, చిన్నపల్లిపేటకు చెందిన వనుము పాపమ్మ, సూర్యనారాయణ వృద్ధ దంపతులు. కుమారుడిని కష్టపడి పెంచి ప్రయోజకుడిని చేసి వివాహం కూడా చేశారు. పాలు అమ్ముకుంటూ ప్రభుత్వం పాపమ్మ పేరున మంజూరు చేసిన ఇంటిలో జీవనం సాగిస్తున్నారు. అయితే కుమారుడు తమను రోజూ కొడుతూ, ఇంటిలో నుంచి వెళ్లిపోవాలని హింసిస్తున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు జేసీని కలిసి తమను ఆదుకోవాలని వేడుకున్నారు. సదరు కుమారుడిపై సీనియర్ సిటిజన్ కేసును నమోదు చేయాలని జేసీ తక్షణం ఆదేశాలు జారీ చేశారు.



వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన వృద్ధ దంపతులు



'పద్మం' మెగా లాంచ్ లోగోను ఆవిష్కరిస్తున్న నటి రితికానాయక్, షోరూం అధినేతలు

సిక్కోలులో రితికానాయక్ సందడి

- 'పద్మం' వెండి దుకాణాన్ని ప్రారంభించిన నటి
- డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్ ఆవిష్కరణ



అభివాదంచేస్తున్న నటి రితికా నాయక్

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జీటీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'పద్మం' వెండి వస్తువుల షోరూంను వర్ధమాన నటి రితికా నాయక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అభిమానులతో కలిసి సందడి చేశారు. రిబ్బన్ కట్ చేసి దుకాణ ప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. పద్మం లాంచ్ లోగోను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా సిక్కోలు అభిమానులతో కలిసి డ్యాన్స్ చేస్తూ అలరించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాకుళం టూటౌన్ సీఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివ రిస్తూ రూపొందించిన డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు.

ఫిర్యాదులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



వృద్ధుల వినతులను పరిశీలిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పూర్తి స్థాయిలో పరిష్కరించాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యా దులు నమోదు, పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 52 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే వాటిని సంబంధిత పోలీసు అధికారులకు తెలిపి చట్టప్రకారం చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

ఒడిశా గవర్నర్‌ను కలిసిన బీఆర్ఏయూ వీసీ



ఒడిశా గవర్నర్ హరిబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒడిశా గవర్నర్ డాక్టర్ కె.హరిబాబును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని సోమవారం విశాఖలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్సిటీలో చేపట్టిన విద్యా సంబంధ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ఆమె వివరించారు. వర్సిటీలో నిర్వహిస్తున్న నాలుగేళ్ల ఉపాధ్యాయ విద్యా కోర్సులో ఒడిశా రాష్ట్రానికి చెందిన చాలా మంది విద్యార్థులు చదువుతున్నారని ఆమె వివరించారు. వర్సిటీ అందజేస్తున్న ప్రత్యేక కోర్సులు, నూతన ప్రణాళికలను ఆయనకు వీసీ వివరించారు.

జనసేన సభ్యుని కుటుంబానికి ఆర్థిక సాయం




బాధిత కుటుంబాలకు చెక్కులు అందిస్తున్న నాగబాబు

నరసన్నపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మాకివలస గ్రామానికి చెందిన జనసేన పార్టీ సభ్యుడు రావాడ ఉదయ్ సింహాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లి వస్తూ.. భోగాపురం వద్ద వాహన ప్రమాదంలో మృతిచెందాడు. ఉదయ్ తల్లిదండ్రులకు జనసేన ఎమ్మెల్సీ కె.నాగబాబు రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ప్రమాదబీమా చెక్కును అందజేశామని, ఉదయ్ కుటుంబ సభ్యులను జనసేన ఆదుకుంటుందని నాగబాబు చెప్పినట్టు ఉదయ్ తండ్రి రావాడ రమణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బలగ ప్రవీణ్ పాల్గొన్నారు.

జనసైనికుడికి రూ.5లక్షల సాయం

హరిపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మందస మండలం అంబుగాం గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీల కార్యకర్త బల్ల పాపారావు కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని జనసేన కార్యదర్శి, ఎమ్మెల్సీ కె.నాగబాబు మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం అందజేశారు. జనసైనికుడు పాపారావు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందటంతో ఆ కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందజేశారు. రాష్ట్రంలో మొత్తం 220 మందికి ఆర్థిక సాయం అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా జనసేన అధ్యక్షుడు పి.చంద్రమోహన్, వి.దుర్గారావు, కె.అనిల్ కుమార్, మజ్జి భాస్కరరావు, ఇంటివెనుక ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ మాలధారణ శోభాయాత్ర

సోంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేతాజీనగర్‌లో శ్రీరామ మాలధారణ శోభాయాత్ర సోమవారం నిర్వహించారు. కుత్తుమ, రుషికుద్ద, బెంకిలి, పలాసపురం శివస్వాములు, భవానీ స్వాములు, అయ్యప్ప స్వాములు సన్నిధానంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భారీ శివలింగం, శ్రీరామ ఉత్సవమూర్తులు, అఖండ దీపం ప్రత్యేక వాహనంలో పెట్టి నేతాజీనగర్ హనుమాన్ మందిరం నుంచి కోదండరామస్వామి ఆలయం వరకు శోభాయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో కొక్కిలి దేవదత్తం, తెప్పల రవి, టి.ధర్మరాజు, టి.కృష్ణారావు, ఆర్.హేమలత తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామావతారం వేషధారణలో స్వాములు

సొంత భవనాల్లేవు

- ఇదీ ప్రభుత్వ కార్యాలయాల తీరు
- ఇబ్బందులుపడుతున్న ప్రజలు, అధికారులు

గార, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల వ్యవస్థ ఏర్పడి మూడు దశాబ్దాలు గడిచి పోయినా నేటికి కూడా పలు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. దీంతో నిత్యం సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూర్వపు సమితి కేంద్రమైన గార ను మండలంగా ఏర్పాటు చేశారు. మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణం చేపట్టారు. అయితే మిగిలిన వ్యవసాయ శాఖ, వెలుగు, గృహ నిర్మాణ శాఖ, గ్రామీణ ఉపాధి పథకం, ఆర్ అండ్‌బీ తదితర శాఖలకు నేటికీ సొంత భవనాలు లేవు. ఇటీవల వంశ ధార నదిపై వంతెన నిర్మాణంలో భాగంగా అప్రోచ్ రోడ్ కోసం మండల విద్యాశాఖ, పశుసంవర్థకశాఖ కార్యాలయాలను పడగొట్టారు. వీటిని ఇప్పుడు పరాయి పంచన నిర్వహించాల్సి వస్తోంది. గారలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలం ఎక్కడా లేకపోవడంతో ఇంతవరకు సొంత భవనాల నిర్మాణంపై సంబంధిత అధికారులు, పాలకులు దృష్టి సారించలేదు. దీనివల్ల వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. సంబంధిత అధికారులు కూడా ఇక్కట్లకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



పాత రెవెన్యూ కార్యాలయంలో నిర్వహిస్తున్న హౌసింగ్ శాఖ భవనం



వ్యవసాయాధికారి కార్యాలయం..

దళారీ వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం: ఎమ్మెల్యే రవికుమార్



సరుబుజ్జిలి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

సరుబుజ్జిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడే దళారీ వ్యవస్థ నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే, పీయూసీ కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ అన్నారు. సరుబుజ్జిలి రైతు సేవా కేంద్రంలో సోమారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, అలాగే ఎస్‌హెచ్‌జీ మహిళల సహజ ఉత్పత్తుల శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసినప్పుడు తూకంలో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. అటువంటి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మిల్లర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. డ్వాక్రా సంఘాల మహిళలను అన్ని రంగాల్లో ఆర్థిక స్వావలంబన సాధించే దిశలో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, జిల్లా నాబార్డు అభివృద్ధి అధికారి రమేష్ కృష్ణ, డీసీసీబీ ఛైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, తహసీ ల్దార్ ఎల్.మధుసూదన్, ఎంపీడీవో ఎం.పావని, ఏవో కె. మన్మథరావు, ఏపీఎం గోవిందరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు అండగా ప్రభుత్వం

పొందూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన చేసే దిశలో ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సిస్టం కళాశాల ఆవరణలో మెగా జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.లక్ష్మి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ అన్నెపు రాము, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి చిన రంగ, పార్టీ ఉపాధ్యక్షుడు బాడాన గిరి పలువురు నేతలు, కళాశాల డైరెక్టర్ ఎం.మోహనరావు తదితరులు పాల్గొన్నారు. రాపాక గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రవికుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.వెంకటేష్, ఏవో శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వండాన మురళి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు స్వాతి ఎంపిక



స్వాతి

జి.సిగడాం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి క్రీడలకు అండర్-19 పోటీలకు కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థిని ఆర్. స్వాతి ఎంపికైనట్టు ప్రత్యేకాధికారి ఇల్ల ప్రమీల తెలిపారు. ఇంటర్ మొదటి సంవ త్సరం స్వాతి ఈనెల 26 నుంచి 30 వరకు హర్యా నా రాష్ట్రం భివానిలో జరగ నున్న 4/100 రిలే పరుగు పందెం పోటీలో పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా స్వాతి ని ప్రత్యేకాధికారితో పాటు వ్యాయామ ఉపాధ్యాయిని కె.సత్యవతి, ఉపాధ్యాయులు అభినందించారు.

'కొండా'కు మంత్రి అభినందన



శంకర్‌ను అభినందిస్తున్న కేంద్ర మంత్రి

ఇచ్ఛాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెడ్డిక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఛైర్మన్‌గా నియమితులైన కొండా శంకర్‌రెడ్డిని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అభినందించారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం కేంద్రమంత్రిని శంకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

శంకర్ చెరువు పరిశుభ్రత

రణస్థలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శంకర్ చెరువును సోమవారం పారిశుధ్య కార్మికులు శుభ్రపరిచారు. ఈ చెరువులో స్థానికులు నిత్యం స్నానాలు చేస్తారు. కార్తీక మాసంలో భక్తులు ఈ చెరువులో వేసిన పూజా సామగ్రిని బయటకు తీసి శుభ్రం చేశారు.

కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయండి

- ఎమ్మెల్యే అశోక్‌కు ఒడ్డి కులస్థుల వినతి



ఎమ్మెల్యే అశోక్‌కు సమస్యలు తెలియజేస్తున్న ఒడ్డి కులస్థులు

ఇచ్ఛాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నియోజకవర్గం నాలుగు మండలాల్లో సుమారు 400 మంది ఒడ్డి కులస్థులున్నామని, కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం తో ఇబ్బందులు పడుతున్నామని, తగు చర్యలు తీసుకోవాలని పలువురు ఒడ్డి కులస్థులు వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను రామయ్యపుట్టుగలో కలిసి వినతి పత్రం అందించి సమస్యలను విన్నవించారు. జిల్లాలో ఇతర నియో జకవర్గాల్లో ఒడ్డి కులస్థులకు బీసీ-ఎ ధ్రువీకరణ పత్రాలిస్తున్నారని, ఇక్కడ మాత్రం ఇవ్వడం లేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తగు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా ఇదే సమస్యను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లోనూ వినతిపత్రం అందిం చారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బృందా వన్ పండిత్, మరళీ పండిత్, ఉపాధ్య క్షుడు శివప్రసాద్ పండిత్, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షు రాలు బి.హైమా వతి, టీడీపీ నేత కొరాయి ధర్మరాజు పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన నాయకులకు అవకాశం

- ఏఐసీసీ కార్యదర్శి సూరత్‌సింగ్ ఠాకూర్



మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి ఠాకూర్

అరసవల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన నాయకులు, కార్యకర్తలను గుర్తించి వారికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా నియమించేందుకు ఆలిండియా కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందని ఏఐసీసీ కార్యదర్శి సూరత్‌సింగ్ ఠాకూర్ అన్నారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆలోచన లను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రథమ ప్రాధాన్యమని అన్నారు. జిల్లా కాంగ్రెస్ పదవికి ఇప్పటికే దరఖాస్తులు అందాయని, ఈనెల 27 వరకు అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి స్థానిక నాయకులతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రతీ నియోజకవర్గం నుంచి అభిప్రాయ సేకరణ చేసి, వాటిని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీకి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ కమిటీ సభ్యులు ఎల్.రామారావు, పి.శాంతికుమారి. నేతలు రెల్ల సురేష్, అంబటి కృష్ణారావు, సనపల అన్నాజీరావు, బస్వా షణ్ముఖరావు, చక్రవర్తిరెడ్డి, పూడి కిరణ్‌కుమార్, గోవింద మల్లిబాబు, కేవీఎల్ ఎస్‌ఈశ్వరి, మంత్రి నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయంలో వేలంపాట

అరసవల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో 23 అంశాలకు సంబంధించి సోమవారం టెండరు కం బహిరంగ వేలంపాట నిర్వహించారు. తలనీలాలు, పాలు, పెరుగు సరఫరా, పూలు, ప్రసాదాలకు సంబంధించి ఎవరూ రాకపోవడంతో ఆ అంశాలను వాయిదా వేశారు. అలాగే కొన్ని అంశాలకు సంబంధించి ఈ-టెండర్లను పరిశీలించిన అనంతరం ఖరారుచేయడం జరుగుతుందని ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు. రానున్న రథసప్తమి ఉత్సవాలకు సంబంధించి లైటింగ్, స్వామివారి ఫొటోలు, శానిటేషన్, కూరగాయల సరఫరా తదితర అంశాల్లో టెండర్లను ఖరారు చేశారు. కార్యక్రమంలో గురునాథరావు, బాల భాస్కర సాయి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుడికి రూ.లక్ష విరాళం



ఈవోకు చెక్కును అందజేస్తున్న భక్తులు

అరసవల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామికి శ్రీకాకుళం నగరానికి చెందిన మాన్విక, కృష్ణ రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మేరకు సోమవారం స్వామిని దర్శించుకున్న అనంతరం ఈవో ప్రసాద్‌కు చెక్కును అందించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి స్వామి వారి ప్రసాదం, జ్ఞాపిక ను అందజేశారు.

న్యూస్ బాక్స్

విధుల నుంచి 'ఉపాధి' క్షేత్ర సహాయకుడు తొలగింపు

జి.సిగడాం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మదుపాం గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు దుప్పాడ పోతయ్యను విధుల నుంచి తొలగించినట్లు ఏపీవో సీహెచ్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో సుమారు రూ.2.88లక్షల నిధులు దుర్వినియోగం చేసినట్లు అధికారులు గుర్తించారన్నారు. అలాగే పంచాయతీ నుంచి వచ్చిన పలు ఫిర్యాదుల మేరకు ఎచ్చెర్ల క్లస్టర్ ఏపీడీ లోకేష్ విచారణ చేపట్టి నివేదికను డ్వామా పీడీ సుధాకర్‌కి అందించారన్నారు. ఈ మేరకు పోతయ్యను తొలగిస్తూ పీడీ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

9 నుంచి కారు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో వచ్చే నెల 9వ తేదీ నుంచి కారు డ్రైవింగ్‌లో యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ ఎన్.రాంజీ ఒక ప్రకటనలో తెలిపారు. 19నుంచి 45 ఏళ్ల లోపు వయసు ఉన్న ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువకులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. 30 రోజుల శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 79933 40407, 95534 10809 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కోటి సంతకాల పత్రాలు అందజేయాలి

ఇచ్ఛాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మున్సిపాల్టీ, మండలంలో సేకరించిన కోటి సంతకా లు పత్రాలను పీడీఎఫ్ ఫార్మేట్ డిసెంబరు ఒకటి నాటికి అందజేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా విజయమ్మ కోరారు. సోమవారం ఎంపీపీ చాంబర్‌లో పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు ఎంపీపీ బోర పుష్ప పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన

సోంపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తురక శాసన గ్రామంలో సోమవారం జార్జ్ ఇనిస్టిట్యూట్, కేంద్రీయ కిడ్నీ పరిశోధనా కేంద్రం పలాస ఆధ్వర్యంలో కిడ్నీ రోగులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ కవితయాదవ్ మాట్లాడుతూ.. ఈ వ్యాధి మూలాలకు కారణాలు, ఆహార అలవాట్లు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సత్యనారాయణ, డా.ఖగేశ్వరరావు పాల్గొన్నారు.





రైతులకు అండగా ప్రభుత్వ పథకాలు


కొత్తూరు: ప్రభుత్వ పథకాలను రైతులకు వివరిస్తున్న కలమట


జలుమూరు: లింగాలవలసలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు


పలాస రూరల్: ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు


మెళియాపుట్టి: చాపరలో రైతులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కొత్తూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కోసం అమలు చేస్తున్న పథకాలు వారికి అండగా నిలుస్తున్నాయని జిల్లా పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి అన్నారు. సోమవారం మాతల గ్రామంలో 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

డిమాండ్ ఉన్న పంటలు పండించండి

జలుమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డిమాండు ఉన్న పంటలను పండించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని తహసీల్దారు జె.రామారావు అన్నారు. మండలం లింగాలవలసలో సోమవారం నిర్వహించిన 'రైతన్నా..మీకోసం' కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం వచ్చే పంటలను వేసుకోవాలన్నారు. భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం రైతుల కోసం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలతో పాటు విత్తనాలు, ఎరువులు అందిస్తుందన్నారు ఈ కార్యక్రమంలో వీఆర్వోలు అర్జునరావు, రాము, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

పలాస రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని.. ప్రతి రైతుకూ మేలు చేసేలా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. పలాస మండలం లొద్దభద్ర గ్రామంలో సోమవారం 'రైతన్నా..మీకోసం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులను టీడీపీ నాయకులు కలుసుకొని కూటమి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా కృషి సాథి కేంద్రాల ద్వారా పంట నష్టం అంచనా వేయడం, నీటి వనరుల అభివృద్ధికి నిధులు కేటాయింపు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జి.వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్ వంకల కూర్మారావు, వ్యవసాయ ఏడీ రామారావు, తహసీల్దార్ కల్యాణచక్రవర్తి పాల్గొన్నారు. లక్ష్మీపురంలో మండల ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్ ఆధ్వర్యంలో 'రైతన్నా..మీకోసం' కార్యక్రమం నిర్వహించారు.

రైతులను ఆదుకుంటాం..

మెళియాపుట్టి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం అధికంగా నిధులు మంజూరు చేస్తుందని కొసమాల పీఏసీఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు తెలిపారు. సోమవారం చాపర, పట్టుపురం గ్రామాల్లో 'రైతన్నా..మీకోసం' కార్యక్రమం నిర్వహించారు.ర రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అవసరమైన తోడ్పాటును అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో ప్రసాద్‌పండా, టీడీపీ నాయకులు వెంకట్రావ్, దినకర్‌రావు, పరమేష్‌రెడ్డి, పోలినాయుడు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఇది రైతు ప్రభుత్వం

టెక్కలి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమది రైతు ప్రభుత్వమని కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ చైర్మన్ బగాది శేషగిరిరావు అన్నారు. సోమవారం అక్కవరంలో 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు రామకృష్ణ, పోలాకి షణ్ముఖరావు, మెండ దమయంతి, ప్రసాద్‌రెడ్డి, శ్రీరాములు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వినియోగించుకోండి

ఇచ్ఛాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తహసీల్దార్ ఎన్.వెంకటరావు అన్నారు. సోమవారం తేలుకుంచి గ్రామంలో సోమవారం 'రైతన్నా మీకోసం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. వ్యవసాయాధికారి పీపీవీవీ అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతుల ఆదాయం పెంపు లక్ష్యంగా రానున్న రబీ, ఖరీఫ్‌లకు సమ గ్ర కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరర్‌రావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

కంచిలి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో నిర్వహిస్తున్న రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ప్రతీ రైతు వినియోగించుకోవాలని వ్యవసా యాధికారి కొంక్యాన సురేష్ అన్నారు. సోమవారం గోకర్ణపురంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ రైతు ఇంటి వద్దకు కార్యక్రమం లక్ష్యాన్ని వివిధ అనుబంధ శాఖ అధికారులు వివరంచారు. అలాగే వివిధ గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకుడు మాదిన రామారావు, హార్టికల్చర్ అసిస్టెంట్ ఎస్.రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసమే..

సోంపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారంతో అవసరమైన పథకాలను అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ చైర్ పర్సన్ మద్దిల విజయలక్ష్మి అన్నారు. రైతన్నా మీ కోసం వారోత్సవాలను సోమవారం బుసాభద్ర, చౌకపేట, పొత్తంగి గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు, వ్యవ సాయ సిబ్బంది పాల్గొన్నారు. తాళభద్రలో జరిగిన కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జగన్నాథం పాల్గొన్నారు.

మేలు చేయడమే లక్ష్యం

కవిటి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో రైతన్నలకు మేలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యని పీఏసీఎస్ చైర్మన్ బాసుదేవ్‌ప్రదాన్ అన్నారు. రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని కవిటిలో సోమవారం నిర్వహించారు కార్యక్రమంలో టీడీపీ నేతలు బి.రమేష్, ఎ.మధు, బి.తిరుమలరావు, టి.మోహనరావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు తోడుగా..

శ్రీకాకుళం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు స్వాతి శంకర్ అన్నారు కళ్లేపల్లిలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో సోమవారం రైతుల ఇళ్లకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి ఎకరాకు నీరు, ప్రతి ఇంటికి ఆదాయం, ప్రతి పంటకు గిట్టుబాటు ధర ఇవ్వడం ప్రభుత్వం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.


టెక్కలి రూరల్: అక్కవరంలో కరపత్రాలను పంచిపెడుతున్న నాయకులు


ఇచ్ఛాపురం: రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్


సోంపేట రూరల్: రైతులకు కరపత్రాలు అందిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి


కవిటిలో రైతులతో మాట్లాడుతున్న నేతలు

క్రైం కార్నర్

కట్టుకున్నవాడే కడతేర్చాడు

వీడిన వివాహిత హత్య కేసు మిస్టరీ


హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లక్ష్మణరావు

సంతబొమ్మాళి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నౌపడ ప్రాంతంలో ఇటీవల కనిపించిన వివాహిత మృతదేహానికి సంబంధించిన మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ మేరకు నిందితుని అదుపులోకి తీసుకున్నట్టు టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు టెక్కలి మండలం కొండ భీంపురం గ్రామానికి చెందిన దాసరి బాలకృష్ణకు నందిగాం మండలం శివరాంపురం గ్రామానికి చెందిన కొనారి పుష్పలతతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. దంపతుల మధ్య గత మూడేళ్లుగా విభేదాలు కొనసాగుతున్నాయి. బాలకృష్ణ వ్యసనాలకు బానిసై భార్య పుష్పలతను అనుమానిస్తూ పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండేవాడు. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. విషయం గ్రామ పెద్దల దృష్టికి వెళ్లడంతో బాలకృష్ణను మందలించారు. అందరి ఎదుట భార్య తనను అవమానించిందని భావించిన బాలకృష్ణ.. ఆమె చంపాలని నిర్ణయించుకున్నాడు. మరోవైపు భర్త ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో నందిగాంలో పుష్పలత పిల్లలతో వేరుగా కాపురం ఉంటోంది. భర్తపై మెయింటెన్స్ కేసు కూడా వేసింది. ఈ నేపథ్యంలో అవకాశం కోసం ఎదురు చూస్తున్న బాలకృష్ణకు ఈ నెల 20న భార్య పుష్పలత ఫోన్ చేసి పిల్లల గురించి మాట్లాడాలని చెప్పింది. ఇదే అదనుగా భావించిన బాలకృష్ణ టెక్కలిలో కలుసుకొని ఎవరూ లేని చోట మాట్లాడుకుందామని నమ్మించి ద్విచక్ర వాహనంలో నౌపడ మూడు రోడ్ల జంక్షన్‌లోని ముళ్ల పొదల్లోకి తీసుకువెళ్లాడు. అక్కడ మాట్లాడుతున్నట్లు నటించి తనతో తీసుకువచ్చిన కర్రతో ఆమె తల ముఖంపై బలంగా కొట్టి చంపాడు. ఆమె సెల్‌ఫోన్‌ను, కర్రను ముళ్లపొదల్లో పడేసి వెళ్లిపోయాడు. నౌపడ వీఆర్‌వో జోగారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దాసరి బాలకృష్ణను అరెస్టు చేసి రి మాండుకు తరలించినట్లు డీఎస్పీ లక్ష్మణరావు తెలిపారు. ఈ సమావేశంలో టెక్కలి రూరల్ సీఐ శ్రీనివాసరావు, నౌపడ ఎస్‌ఐ నారాయణస్వామి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గార, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేర్లవానిపేట గ్రామానికి చెందిన కొమర నారాయణ స్వామి (62) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నారాయణస్వామి సీమెన్‌గా పని చేసేవాడు. పది నెలలుగా గ్రామంలోనే ఉంటున్నాడు. డబ్బులు వృధాగా ఖర్చు చేస్తుండడంతో భార్య సత్యవతి తరచూ నిలదీసేది. దీంతో మనస్తాపానికి గురైన నారాయణ స్వామి శనివారం తలకు రాసుకునే ద్రావణాన్ని తాగాడు. ఆ తర్వాత కారులో భార్య, కుమార్తెతో కలిసి విశాఖపట్నానికి బయలుదేరాడు. మార్గమధ్యలో నాతవలస వద్దకు వెళ్లేసరికి అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో గమనించిన భార్య, కుమార్తె వెంటనే విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. నారాయణ స్వామి భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ పి.చంద్రమోహన్ తెలిపారు. నారాయణ స్వామికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారికి వివాహాలయ్యాయి.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి వద్ద ఉన్న వంతెన ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతడికి గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఫాజుల్‌బాగ్‌పేటకు చెందిన రేయ్య లోకేష్ సీట్ సెంట్రింగ్ పనులు చేస్తూ తన కుమారుడితో కలిసి జీవనం సాగిస్తున్నాడు. అయితే లోకేష్ ఆదివారం మద్యం సేవించి ఇంటిలో భోజనం చేసిన అనంతరం దగ్గరలో ఉన్న దత్తగుడి వద్ద ఉన్న వంతెన ఫుట్‌పాత్‌పై నిద్రించాడు. నిద్రమత్తులో ఉన్న లోకేష్ చేయి రోడ్డుపైకి ఒరగగా డేఅండ్‌నైట్ కూడలి నుంచి కిమ్స్ ఆసుపత్రి వైపు వెళుతున్న వాహనం అతని చేయిపై నుంచి వెళ్లడంతో గాయాలపాలయ్యాడు. దీనితో రోడ్డుకు అవతల వైపు కూర్చున్న హర్షవర్ధన్ అనే వ్యక్తి చూసి 108 వాహనానికి సమాచారం అందించి చికిత్స అందించాడు. లోకేష్ స్పృహలో లేకపోవడంతో అతని భార్య నాగమణి ఫిర్యాదు మేరకు సోమవారం ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మోటార్ సైకిల్‌తో ఢీకొన్న వ్యక్తిపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళుతున్న ఓ కుటుంబాన్ని మోటార్ సైకిల్‌తో వచ్చి ఢీకొని పరారైన వ్యక్తిపై బాధిత మహిళ ట్రాఫిక్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి.. కె.లావణ్య కంపోస్టు కాలనీలో నివాసం ఉంటున్న తన తల్లిదండ్రుల వద్ద నుంచి ఆదివారం రాత్రి దమ్మలవీధి వద్ద ఉన్న వైష్ణవీధికి తన ఇంటికి స్కూటీపై భర్త, కుమారుడితో వెళుతున్న సమయంలో కిన్నెర థియేటర్ జంక్షన్ వద్ద మోటార్ సైకిల్‌పై వచ్చి ఓ వ్యక్తి ఢీకొని పరారయ్యాడు. వాహనం నెంబర్ కూడా చూడ లేదని, గాయాలు కావడంతో రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడి అదృశ్యంపై..

లావేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): లోపెంటకు చెందిన కరణం సన్యాసి (72) అదృశ్యమైనట్లు లావేరు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సన్యాసి ఈనెల 8న లోపెంటలోని తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అతని బంధువు జీరు సన్యాసిరావు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సన్యాసి విశాఖపట్నంలోని లంకెల పాలేంలో కూలీ పనులు చేసేవాడని, అక్కడికి కూడా వెళ్లి వెతికినా సన్యాసి కనిపించ లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సన్యాసి ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో కుంకుమ కలర్ టీ షర్టు, ఆరెంజ్ కలర్ టవల్‌ను ధరించి ఉన్నాడన్నారు. సన్యాసి జాడ తెలిసిన వారు లావేరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

టెక్కలి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గోపీనాథపురం గ్రామానికి చెందిన కె.పద్మనాభం(35) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు పద్మనాభం నాలుగు రోజుల కిందట గోపీనాథపురం ప్రాంతంలో ఒక వ్యక్తితో జరిగిన ఘర్షణలో గాయపడ్డాడు. దీంతో ఆయనను స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయమై సీఐ విజయ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా తనకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. పద్మనాభం మతిస్థిమితం లేక తరచూ అందరితో గొడవ పడేవాడని తెలిపారు.

నేడు మండల సమావేశం

సంతబొమ్మాళి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన మంగళవారం ఉదయం 10 గంటలకు తమ కార్యాలయ మందిరంలో జరుగుతుందని ఎంపీడీవో పి.జయంత్‌ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

మిల్లర్ల మోసాల నుంచి కాపాడండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మందస, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లర్ల మోసాల నుంచి రైతులను కాపాడాలని రైతు సంఘ నాయకులు తహశీల్దార్ మిస్క శ్రీకాంత్‌ను కోరారు. మందస తహశీల్దార్ కార్యాలయంలో రైతుల సమస్యలపై సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గత ఏడాది రైతుల నుంచి ధాన్యం బస్తాను 80కేజీలకు బదులు 84 కేజీలు తీసుకున్నారని తెలిపారు. తేమపేరుతో ధర తగ్గించడం, ట్రాక్టరు మామూలు, బస్తా మామూలు పేరుతో అక్రమంగా వసూలు చేశారని వివరించారు. ఈ ఏడాది అటువంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. పక్క రాష్ట్రాల మాదిరిగా ధాన్యం బస్తాకు రూ.800 నుంచి రూ.1000 బోనస్ ఇప్పించాలని కోరారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని వినతిప్రతంలో కోరారు. అలాగే మందస నుంచి హరిపురం బీటీరోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక వికాసం: ఎమ్మెల్యే


పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పోలాకి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మానసిక వికాసానికి క్రీడలు దోహద పడతాయని ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి అన్నారు. సోమవారం ఈదులవలస ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గ్రిగ్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బగ్గ అర్చన, రోణంకి కృష్ణంనాయుడు, ఎంఈఓలు శ్రీనివాసనాయక్, ఎస్.శ్రీనివాసరెడ్డికిడ, సర్పంచ్ ముద్దాడ భాస్కరప్రభావతి, విద్యాకమిటీ చైర్మన్ ఎర్రయ్య, ప్రధానోపాధ్యాయులు దాస్, ఎంపీడీఓ రవికుమార్, తహశీల్దార్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కుసుమపోలవలసలో నిర్వహించిన రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

సందడిగా గ్రిగ్స్ పోటీలు

టెక్కలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో 13 పాఠశాలల నుంచి 320మంది క్రీడాకారులతో సోమవారం స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో గ్రిగ్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంఈవోలు డి.తులసీరావు, డి.చిన్నారావు, ప్రధానోపాధ్యాయులు నందికేశ్వరరావు ఈ క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రీడా డివిజినల్ ఇన్‌చార్జ్ బి.నారాయణరావు, ఎంఎస్‌వో లక్ష్మణరావు, రమణయ్య, వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

నందిగాం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగపరుచుకోవాలని దిమిలాడ, తెంబూరు పీఏసీఎస్ అధ్యక్షులు పినకాన అజయ్‌కుమార్, పోలాకి చంద్రశేఖరరావులు కోరారు. సోమవారం నర్సిపురంలో గల పీఏసీఎస్ కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.సోమేశ్వరరావు, ఏవో పి.శ్రీకాంత్‌వర్మ, వంశధార డీసీ చైర్మన్ ఎం.బాలకృష్ణ, పీఏసీఎస్ సీ ఈ వో పి.శ్రీనుబాబు, నాయకులు ఎం.లోకనాథం, ఎస్.దామోదరరావు, పి.ఉమాపతి పాల్గొన్నారు.

ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోండి


సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

పాతపట్నం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా ఆదాయం పెరిగేలా చర్యలు చేపట్టాలని టెక్కలి డీఎల్‌పీవో ఐవీ రమణ సూచించారు. మేజర్ పంచాయతీ పాతపట్నంలోని ఆల్‌ఆంధ్రా రోడ్డులో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాతపట్నం ఈవో ఊన రామచంద్రరావు మాట్లాడుతూ ఇక్కడ తయారైన వర్మీ కంపోస్టు అమ్మకాలయ్యేలా చొరవ చూపాలని కోరారు. దీనిపై డీఎల్‌పీవో స్పందిస్తూ.. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలని.. అంటు వ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట స్థానిక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం


బాధితురాలికి చెక్కును అందజేస్తున్న నాయకులు

టెక్కలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట ఘటనలో గాయపడిన వారికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. తెలిసీలాపురం గ్రామానికి చెందిన రోణంకి రామలక్ష్మి గాయపడి.. పూర్తిగా నడవలేని స్థితిలో ఉంది. దీంతో కుటుంబ సభ్యులు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రూ.లక్ష మంజూరు చేయించారు. ఈ మొత్తాన్ని కూటమి నాయకులు సోమవారం బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ చెర్మన్ బాగాది శేషగిరావు, జనసేన నాయకులు కణితి కిరణ్, టీడీపీ నాయకులు రామకృష్ణ, రాము, ప్రసాద్‌రెడ్డి, షణ్ముఖరావు, రాజారావు, దూర్వాసులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించరూ!


కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న విద్యార్థినులు

పలాస, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాము నిత్యం తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నామని... ఈ సమస్యను తక్షణం పరిష్కరించాలని స్థానిక హడ్కో కాలనీలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు మున్సిపల్ కమిషనర్ ఇ.శ్రీనివాసులును కోరారు. ఈ మేరకు కమిషనర్ వార్డ్ విజిట్‌లో భాగంగా సోమవారం హడ్కో కాలనీ ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడుతూ సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. దీంతో వారు తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తక్షణం ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి నీటి సమస్య పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం చాకలివీధి, కోర్టు వీధి జంక్షన్, రామలక్ష్మణకాలనీ, జీడిపండు జంక్షన్ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. కల్వర్టుల మరమ్మతులు, కుళాయిలకు ట్యాప్‌లు, కాలువల్లో పూడికలు తీయాలని స్థానికులు అభ్యర్థించడంతో తక్షణం పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు డొక్కరి శంకర్, సచివాలయ సిబ్బంది, శానిటేషన్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

కోటబొమ్మాళి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు కోటబొమ్మాళి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్.గీతిక ఎంపికైందని ఎంఈవో డబ్బీరు గోవిందరావు సోమవారం తెలిపారు. మహారాష్ట్రలోని కోకంతాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో గీతిక పాల్గొంటుందని తెలిపారు

సంతబొమ్మాళిలో...

సంతబొమ్మాళి, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి అండర్-17 కబడ్డీ పోటీల్లో నౌపడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చారని ప్రధానోపాధ్యాయులు ఎం.భానుప్రకాష్ తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు కె.వసుంధర, సీహెచ్.గౌరి స్వరూప్, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు జనార్దనరావు, శ్యాం, కాంతారావులు అభినందించారు.

ఘనంగా సత్యసాయి శత జయంతి వేడుకలు

మందస, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శతజయంతి వేడుకలను మందసలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నగర సంకీర్తన, పతాకావిష్కరణ, నారాయణ సేవ చేశారు. అనంతరం బాలవికాస్ పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ వూన ఈశ్వరరావు, బమ్మిడి బైరాగి, యూత్ కన్వీనర్ మద్ది శివ, మద్ది మోహనరావు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఐతమ్‌కు గుర్తింపు

టెక్కలి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎంబీఏ కోర్సులకు ప్రతిష్ఠాత్మక నేషనల్ బోర్డు ఆఫ్ ఎక్రిడేషన్ టైర్-1 గుర్తింపు లభించిందని డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐతమ్‌లో అందిస్తున్న మేనేజ్‌మెంట్ విద్య జాతీయ ప్రమాణాలకు మించి ఉందని తెలిపారు. దీని వల్ల అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్యలో ప్రత్యేక గుర్తింపు, పరిశ్రమల్లో విశ్వసనీయత లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, కోశాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

కోటబొమ్మాళి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీడీయూ-జీకేవై పథకం ద్వారా విశ్వసముద్ర గ్రూప్ వారి స్టార్ టెక్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ శేఖర్ పట్నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన స్థానిక విద్యార్థులకు సెక్యూరిటీ గార్డ్, స్టోర్ అసిస్టెంట్‌గా ఉచితంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 79934 39036, 95022 06220, 79956 78063 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

కరాటేలో బాలికల ప్రతిభ

హిరమండలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో నిర్వహించిన అస్మిత ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీలలో హిరమండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బాలికల కటా, కిక్ బాక్సింగ్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు కోచ్ సింహాచలం చెప్పారు.